సాక్షి
సూర్యాపేట
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



వైభవంగా నిత్య కల్యాణం
మట్టపల్లి ఆలయంలో రాజ్యలక్ష్మి, చెంచు లక్ష్మీ సమేత నృసింహుడి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.
- 10లో



పంటలను కాపాడాలి
వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ ఇచ్చి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి కోరారు.
- 10లో



79లక్షల మంది ఉపాధికి దూరం
కేంద్రం వైఖరితో దేశంలో 79లక్షల మంది ఉపాధికి దూరమయ్యారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర ఆరోపించారు.
- 10లో

న్యూస్‌రీల్

9న బహిరంగ వేలం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని వెజ్, నాన్ వెజ్ వ్యాపారుల సౌకర్యార్థం పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల కేటాయింపునకు ఈనెల 9న పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 3 సంవత్సరాల కాల పరిమితితో అద్దె ప్రతిపాదికన ఈ దుకాణాల కేటాయింపు ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 7వ తేదీ లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. పూర్తి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పెసళ్లు క్వింటా.. రూ.11,769



సూర్యాపేట మార్కెట్‌కు వచ్చిన పెసళ్లు

భానుపురి : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ సీజన్‌లో పెసళ్ల కు మంచి ధర లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8558లకు మించి రూ.11వేల వరకు పలుకుతోంది. మంగళవారం మార్కెట్ లో అత్యధికంగా రూ. 11,769ల ధర పలకగా.. అత్యల్పంగా రూ.5,693ల ధర వచ్చింది. యార్డుకు 29 మంది రైతులు తమ పంటను అమ్ముకునేందుకు గాను 76 బస్తాలు (46క్వింటాలు) తీసుకొచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కెనడా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల్లో ఉద్యోగం చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం చేపడుతున్నామని, ఈ జాబ్‌మేళాతో అర్హత కలిగిన అభ్యర్థులు విదేశాల్లో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ (వయస్సు 20 నుంచి 35 సంవత్సరాలు మధ్య), డిప్లొమా కోర్సులైన వెల్డర్, మెకానికల్, ప్లేయర్, ఫ్యాబ్రికేటర్, (వయస్సు 25 నుంచి 40సంవత్సరాల మధ్య), బీఈ, బీటెక్ సంబంధించి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్, స్కెఫోలింగ్, స్ట్రక్చరల్, హెచ్‌వీఏసీ డిజైన్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్(వయస్సు 48 సంవత్సరాల లోపు), ఐటీఐ ఫిట్టర్ విభాగంలో అసిస్టెంట్ మిషన్ ఆపరేటర్ (వయస్సు 30 సంవత్సరాల లోపు) పోస్టులు కలవని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5న కలెక్టరేట్ లోని ఉపాధి కల్పన కార్యాలయంల నిర్వహించే జాబ్‌మేళాకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

బడుగుల రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయం



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణలో నూటికి పది శాతం లేని అగ్రకుల రెడ్డి, వెలమల రాజ్యాన్ని దింపి 90శాతం ఉన్న బడుగుల రాజ్యాన్ని స్థాపించడమే ధర్మ సమాజ్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలుగా రెడ్లే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా కొనసాగుతున్నారని, 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఎమ్మెల్యేలుగా మంత్రులుగా చేస్తామని తెలిపారు. ఈ దిశగా సూర్యాపేట జిల్లాలో ధర్మసమాజ్ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం కోసమే పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేసి సబ్బండ కులాల తరపున ధర్మసమాజ్ పార్టీని స్థాపించినట్లుగా పేర్కొన్నారు. ధర్మ సమాజ్ పార్టీ చేస్తున్న ఉద్యమం బీసీ ఎస్సీ ఎస్టీలకు రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వడానికి కాదని, రాజ్యం అప్పగించేందుకని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ కిరణ్ మహరాజ్, లంబాడి హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర నాయక్, జనసేవ సమితి అధ్యక్షుడు జనార్దన్, మహిళా నాయకురాలు కుమారి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి తలారి రాంబాబు శ్రీనివాస్, బాలు, విజయరామ రాజు, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కసరత్తు కొలిక్కి

అభ్యర్థుల ప్రకటనే తరువాయి

- దాదాపుగా పూర్తయిన జాబితా
- ఒకటి రెండు స్థానాల్లో రాని స్పష్టత
- 11న పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం
- అదే రోజు అభ్యర్థుల ప్రకటన, వీలైతే ముందుగానే ప్రకటించే అవకాశం



సాక్షిప్రతినిధి నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కసరత్తు కొలిక్కి వస్తోంది. జిల్లాలోని 12 స్థానాలకు గాను, తుంగతుర్తి, మునుగోడు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని స్థానాల్లో అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చింది. ఇక నాగార్జునసాగర్‌లో కూడా మాజీ మంత్రి జానారెడ్డినే పోటీలో దింపాలన్న ఉద్దేశంతో ఉంది. మిగిలిన 9 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక దాదాపు ఖరారైంది. ఈ నెల 11న పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం నిర్వహించనుంది. అదే రోజు పార్టీ అభ్యర్థులను ప్రకటించనుంది. వీలైతే ముందుగానే ప్రకటించే అవకాశం ఉంది.

చాలా చోట్ల పాతవారే..

నల్లగొండ టికెట్‌ను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మిర్యాలగూడ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి, దేవరకొండ నుంచి బాలూనాయక్, హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పద్మావతిరెడ్డి, సూర్యాపేట నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, భువనగిరి నుంచి కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, నకిరేకల్ నుంచి ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చింది. పెద్దగా మార్పులు ఉండే అవకాశం లేదు.

తుంగతుర్తి, మునుగోడులో ఎవరో?

మునుగోడు నియోజకవర్గం టికెట్ విషయంలో అధిష్టానం వేచిచూసే ధోరణిలోనే ఉంది. మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఉప ఎన్నిక వచ్చింది. బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయనను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు ఆ పార్టీ అధిష్టానం ప్రయత్నాలు చేస్తోంది. అందుకోసమే ఆ స్థానం నుంచి పోటీలో నిలిచే అభ్యర్థి విషయంలో ఓ కచ్చితమైన నిర్ణయానికి రానట్లు తెలిసింది. మునుగోడు నుంచి టికెట్ కోసం చలమల్ల కృష్ణారెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయనతోపాటు పాల్వాయి స్రవంతి, పున్నా కైలాష్‌నేత కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో త్వరలోనే తేలనుంది. తుంగతుర్తి నియోజకవర్గం నుంచి టికెట్ కోసం చాలా మంది పోటీ పడతున్నారు. ఇటీవల మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌ను కలిశారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని, తుంగతుర్తి నుంచి పోటీలో ఉంటారన్న చర్చ సాగుతోంది. మరోవైపు బీఎస్పీ నుంచి మంద గ్రావణ్ కాంగ్రెస్‌లో చేరుతారని, ఆయనను పోటీలో నిలుపుతారన్న వాదన పార్టీ నాయకుల నుంచి వినిపిస్తోంది. మరోవైపు అద్దంకి దయాకర్ కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన గతంలో కొద్దిపాటి ఓట్లతోనే ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన టికెట్ కోసం బలంగా పట్టుబడుతున్నారు. మొత్తానికి అధిష్టానం అక్కడ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

టికెట్ రాని వారికి బుజ్జగింపులు


కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ రాని నేతలకు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తామని అధిష్టానం బుజ్జగించేలా కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ విషయాన్ని ఇప్పటికే కొంతమంది ఆశావహులకు తెలియజేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేషన్ పదవులను ఇస్తామని నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తోంది.

పోటీ చేయనని ప్రకటించినా..

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తాను ఎన్నికల్లో పోటీ చేయనని గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. తన కుమారుల్లో ఒకరైతే కచ్చితంగా పోటీలో ఉంటారని పేర్కొన్నారు. దీంతో ఆయన ఇద్దరు కుమారులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధిష్టానం మాత్రం జానారెడ్డినే పోటీలో దింపాలన్న ఆలోచనల్లో ఉంది. జానారెడ్డి కూడా అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని, తాను సీనియర్‌ను టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే స్థాయి తనది కాదని చెప్పకొచ్చిన విషయం తెలిసిందే. దీనిని బట్టి అధిష్టానం జానారెడ్డినే నాగార్జునసాగర్ నుంచి బరిలోకి దింపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఓటర్లు @ 9,64,346

- నేడు జిల్లా తుది ఓటరు జాబితా ప్రకటించనున్న ఎన్నికల సంఘం
- తుంగతుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 2,48,710 మంది..
- సూర్యాపేటలో అత్యల్పంగా 2,35,341 మంది ఓటర్లు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. త్వరలో శాసన సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తుది ఓటరు జాబితాను బుధవారం ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో బుధవారం ప్రకటించనున్న ఓటర్ల జాబితా ప్రకారం 9,64,346 మంది ఓటర్లు ఉండగా ఇందులో 4,75,915 మంది పురుషులు, 4, 4,88,374 మంది స్త్రీలు 57 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 2,48,710 మంది, అత్యల్పంగా సూర్యాపేట నియోజకవర్గంలో 2,35,341 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా...

జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో 9,64,346 మంది ఓటర్లు ఉన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 2,35,341, కోదాడ నియోజకవర్గంలో 2,37,437, తుంగతుర్తి నియోజకర్గంలో2,48,710 ఇక హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,42,858 మంది ఓటర్లు ఉన్నారు. హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, తుంగతూర్తి నియోజకవర్గంలో పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

పెరిగిన ఓటర్లు...

జిల్లాలో రెండు నెలల క్రితం ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా కంటే బుధవారం ప్రకటించనున్న తుది జాబితా ప్రకారం ఓటర్లు అన్ని నియోజకవర్గాల్లో పెరిగారు. జిల్లా అధికారులు ఓటరు నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో ప్రజలు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. గత ఆగస్టులో ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 9,34,406 మంది ఓటర్లు ఉండుగా తాజా జాబితాలో 9,64,346 మంది ఓటర్లు నమోదైనారు.జిల్లాలో రెండు నెలల కాలంలో 29,940 ఓట్లు పెరిగాయి.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్	ఎన్ఆర్ఐ	మొత్తం
హుజూర్‌నగర్	1,18,664	1,24,030	17	115	32	2,42,858
కోదాడ	1,16,257	1,12,017	15	114	34	2,37,437
సూర్యాపేట	1,15,628	1,19,576	17	102	18	2,35,341
తుంగతుర్తి	1,24,826	1,23,722	08	146	08	2,48,710
మొత్తం	4,75,375	4,88,345	57	477	92	9,64,346

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితా విడుదల

సూర్యాపేట: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తరపున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అభ్యర్థులను మంగళవారం ఆ పార్టీ చీఫ్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. సూర్యాపేట జనరల్ స్థానంలో ఉమ్మడి నల్లగొండ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, దేవరకొండ ఎస్టీ స్థానంలో డాక్టర్ ఎం.వెంకటేష్ చౌహాన్, నకిరేకల్ ఎస్సీ స్థానంలో మేడి ప్రియదర్శిని, కోదాడ జనరల్ స్థానంలో పిల్లుట్ల శ్రీనివాస్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు.

మధ్యంతర భృతి 15శాతానికి పెంచాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 5శాతం మధ్యంతర భృతి (ఐఆర్) తీవ్ర నిరాశకు గురిచేసిందని, దీన్ని 15శాతానికి పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతా రామయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన సంఘం ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఏఐఎస్ శివశంకర్ చైర్మన్‌గా, సభ్యుడిగా రామయ్యలతో కూడిన పీఆర్సీ కమిటీని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం మండిపోతున్న ధరల దృష్ట్యా ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐఆర్ సరైంది కాదని, కనీసం 15శాతం ఉండాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడక ముందే పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు, క్యాష్‌లెస్ ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కోశాధికారి హమీద్‌ఖాన్, ఉపాధ్యక్షురాలు రజితారెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మీకాంతారెడ్డి, కృపాకర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో లక్ష్యాన్ని పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకట్రావు

మునగాల(కోదాడ): సూర్యాపేట జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కేటాయించిన ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం పూర్తి చేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. మండలంలోని మాధవరం పతంజలి ఆయిల్‌పామ్ నర్సరీలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు క్షేత్రస్థాయి అధికారుల విశేషంగా కృషిచేయాలని కోరారు. జిల్లాలో ఈ ఏడాది 10,500 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని లక్ష్యం ఉందన్నారు. దీనిని అధిగమించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయిక్, ఏడీఏలు వాసు, సంధ్యారాణి, వేణుగోపాల్, జగ్గునాయిక్, ఉద్యానవన అధికారులు జగన్, స్రవంతి, అనిత, ఆయిల్‌పామ్ ఏజీఎం పట్టాబిరామ్‌రెడ్డి, డీజీఎం యాదగిరి మేనేజర్ హరీష్, సిబ్బంది శశికుమార్, సుధాకర్, బి.వెంకట్, రంగు ముత్యం రాజు, భద్రాచలం, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చెక్ యువర్ ఓటు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని, ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలతో పాటు కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన చెక్ యువర్ ఓట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ఉపాధి కల్పన అధికారి మాధవ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది వేణు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్‌ఇన్

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య సమస్యలపై గురువారం సాక్షి దినపత్రిక ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రైయినేజీలు, చెత్త పేరుకపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉండటం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఈ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ : 05-10-2023 (గురువారం)
ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ : 99485 40696



దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తిరుమలగిరి

అడ్డదారిలో అధ్యాపకులు!

క్రమబద్ధీకరణకు పీహెచ్‌డీ పట్టా కొనుగోలు

- మూడు నుంచి ఐదు లక్షల రూపాయలకే పట్టా
- అక్రమపట్టాతో ఉద్యోగం పొందిన వారే సూత్రధారులు
- నెలల వ్యవధిలోనే డైరెక్టరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్‌కు పట్టాల సమర్పణపై అనుమానాలు
- సమగ్ర విచారణ జరపాలంటున్న నిరుద్యోగులు



కోదాడ: ఉద్యోగాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అడ్డదారిలో వెళ్తున్నారు. క్రమబద్ధీకరణకు అవసరమైన పీహెచ్‌డీ పట్టాలను సంతలో పప్పు బెల్లాలవలె కొనుగోలు చేసి ఉన్నత విద్యామండలికి సమర్పించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉత్తరభారతదేశంలో ఉన్న పలు ప్రైవేట్, డీమ్డ్, యూజీసీ గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి రూ. 3 నుంచి 5 లక్షల రూపాయలు చెల్లించి నెల రోజుల్లోనే డాక్టరేట్ పట్టాపొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా కొనుగోలు చేసిన డాక్టరేట్‌తో ఉద్యోగం క్రమబద్ధీకరించుకున్న ఓ అధ్యాపకుడు ఈ పీహెచ్‌డీ పట్టాల కొనుగోలు వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

రెగ్యులరైజేషన్‌కు పాట్లు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ఇటీవల ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వీరికి పీజీతో పాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) లేదా, స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్), డాక్టరేట్ (పీహెచ్‌డీ) ఉత్తీర్ణులై ఉండాలని షరుతు విధించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 800 మందిలో కేవలం ఈ అర్హతలున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు 280మంది మాత్రమే ఉండడంతో వారి వరకు క్రమబద్ధీకరించిన ప్రభుత్వం మిగతవారిని పై అర్హతలు సాధించిన తరువాత రెగ్యులరైజ్ చెప్పడంతో కాంట్రాక్ట్ అధ్యాపకులు పట్టాల కోసం పరుగులు పెడుతున్నారు. కష్టసాధ్యంగా మారిన నెట్, సెట్‌లో ప్రతి సంవత్సరం 20శాతం మంది కూడా ఉత్తీర్ణత సాధించడం లేదు. దీంతో ఇక సులువైన మార్గంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు పీహెచ్‌డీల కొనుగోలు దారి పట్టారని తెలుస్తోంది.

రూ.ఐదు లక్షలకే పీహెచ్‌డీ పట్టా...

ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో ఉన్న పలు ప్రైవేట్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీల నుంచి మూడు నుంచి ఐదు లక్షల రూపాయలకు పీహెచ్‌డీ పట్టాలను అమ్మకానికి పెట్టాయి. నాలుగైదు సంవత్సరాల క్రితమే వీరు ఆయా యూనివర్సిటీల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు రికార్డుల్లో రాసి ఈ పట్టాలను అందిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు ఈ పట్టాలను కొనుగోలు చేసి క్రమబద్ధీకరణకు డైరెక్టరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్‌కు సమర్పిస్తున్నారు. ఇన్ని రోజులు లేని పట్టాలు కేవలం రెండు నెలల వ్యవధిలోనే వందల మంది సమర్పించడంపై ఉన్నతాధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 40మంది ఇదే దారి

ఉమ్మడి జిల్లాలో ఉన్న నాగార్జున కళాశాల, నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాల, దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, నకిరేకల్, రామన్నపేట, చండూరు, ఆలేరు డిగ్రీ కళాశాలల్లో దాదాపు 62 మంది వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. వీరిలో నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలున్న వారు 22మందిని ఇటీవల ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. మరో 40 మంది వరకు ఈ అర్హతలు లేక పోవడంతో రెగ్యులరైజ్ చేయలేదు. దీంతో వీరిలో చాలా మంది నెట్, సెట్ పరీక్షలు తమ వల్ల కాదను కొని పీహెచ్‌డీ పట్టాల వేటలో పడ్డారు. ఇప్పటికే దాదాపు 20మంది రాజస్థాన్‌లోని సన్‌సైన్ యూనివర్సిటీ నుంచి ఈ పట్టాలను పొందినట్లు సమాచారం. నెలల వ్యవధిలోనే వీరంతా ఈ పట్టాలను తీసుకురావడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ సేవలకు 'సహకారం'

- కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు
- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- తొలగనున్న పల్లెవాసుల కష్టాలు
- జిల్లాలో 45 పీఏసీఎస్, 2 ఎఫ్ఏసీ కేంద్రాలు



అనంతారంలోని పీఏసీఎస్ కార్యాలయం

పెన్‌పహాడ్: పల్లెవాసులకు ఆన్‌లైన్ సేవలను చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో అంతటా మీసేవ కేంద్రాలు కొనసాగుతుండగా తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ)ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంట్లో భాగంగా పీఏసీఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటికే అందుతున్న సేవలు..

జిల్లాలోని 45ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా (పీఏసీఎస్)లు, గడ్డిపల్లి, తుంగతుర్తి (ఫార్మర్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీ) ఎఫ్ఏ సీఎస్‌తో మొత్తం 47 సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 42వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీటి ద్వారా ఇప్పటికే రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటితోపాటు ఆయా సంఘాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుల నివారణ మందులు విక్రయిస్తున్నాయి. మరికొన్ని సంఘాల ఆధ్వరంలో పెట్రోల్, డీజిల్ బంక్‌లు నిర్వహిస్తున్నాయి. చాలా పీఏసీఎస్‌లు ధాన్యం కొనుగోళు చేస్తూ ఆర్థికంగా అధిక ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. ఇలా వివిధ వ్యాపారాలు చేస్తూ బలోపేతమవుతున్నాయి. వాటిని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చింది.

సీఎస్‌లకు దరఖాస్తులు చేసుకోండిలా..

ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ఆసక్తి కలిగిన రైతు సహకార సంఘాలు కొత్తగా కేంద్రం అనుమతించిన సీఎస్‌సీల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న సంఘాల ఆర్థిక లావాదేవీల ఆధారంగా అవకాశం కల్పించి సిబ్బందికి శిక్షణ అందిస్తాం.

గ్రామీణులకు మరింత చేరువ

ఇన్నాళ్లూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రానికి వెళ్లాం. భూముల రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకోవాలన్నా అక్కడకే వెళ్లి నిరీక్షించాం. సహకార సంఘాల్లో మీ సేవలు అందుబాటులోకి వస్తే గ్రామాల్లోని రైతులు, విద్యార్థులు దూర ప్రాంతాలకు పోయే ఇబ్బందులు తొలిగిపోతాయి. మండలంలో ఉన్న సహకార సంఘాల్లో ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

– జగదీష్, అనంతారం, పెన్‌పహాడ్ మండలం

సంఘాల బలోపేతానికే..



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే వాటిల్లో కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ద్వారా ఆన్‌లైన్ సేవలు అందించడంతో గ్రామీణులకు సేవలు మరింత సులభతరం కానున్నాయి. దరఖాస్తులు చేసుకున్న సంఘాలను గుర్తించి ఆయా సంఘాల సిబ్బందికి శిక్షణ అందిస్తాం. సంఘాల ఆధ్వర్యంలో ఎల్‌పీజీ, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

– శ్రీధర్ డీసీఓ, సూర్యాపేట

సీఎస్‌సీలలో అందనున్న సేవలు

పీఏసీఎస్‌లలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటైతే ప్రస్తుతం మీసేవ కేంద్రాల్లో అందించే ఆన్‌లైన్ సేవలన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మీ సేవ కేంద్రాలు లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలు అవసరమున్న వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు, రైతులు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు పోవాల్సి రావడంతో వ్యయప్రయాసాలకోర్చి వెళ్తున్నారు. సహకార సంఘాల్లో మీ సేవలు అందుబాటులోకి రావడంతో ఆ తిప్పలు తప్పినట్లేనని అంటున్నారు. మీసేవలు అందుబాటులోకి వస్తే నిరుద్యోగులు, పింఛన్‌దారులు, ఉద్యోగులు, రైతులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు సహకార కేంద్రాల్లో సీఎస్‌సీలు ఏర్పాటు చేయడంతో గ్రామీణులకు ఆన్‌లైన్ సేవలు చేరువ కానున్నాయి.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఆల్ మదీనా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని మృతదేహానికి ముస్లిం సాంప్రదాయాల ప్రకారం మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న 80 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా లభించలేదు. మృతుడు ముస్లిం కావడంతో ఆల్ మదీనా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముఫ్తీ ఉమర్ కాష్మీ ముస్లిం సాంప్రదాయాల ప్రకారం వైద్య సిబ్బంది, పోలీసుల పర్యవేక్షణలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో హఫీజ్, నవాజ్, ఇంతియాజ్ ఖాన్, రఫీక్‌ఖాన్, ఫెహీద్, నాయబ్, సజ్జు, ముబీన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం



సైదా మృతదేహం

మాడుగులపల్లి: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని సీత్యాతండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సీత్యాతండాకు చెందిన రమావత్ సైదా(30)కు భార్య బుజ్జి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా సైదాకు, అతడి భార్య బుజ్జికి తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన సైదా సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సైదాను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో మరో ఏడుగురు అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి

మేళ్లచెరువు: హత్య కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు తెలియజేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం కొత్తగూడెం తండాకు చెందిన వాచ్యాతో గత నెల 24న భూమి గెట్టు పంచాయితీ విషయమై అతడి బంధువులు గొడవపడి కొట్టడంతో అతడు మృతిచెందాడు. కాగా వాచ్య మృతికి కారణమైన గుగులోతు చందర్‌రావు కుటుంబ సభ్యులు 11 మందిని శనివారం పోలీసులు రిమాండ్‌కు పంపించారు. పరారీలో ఉన్న ఆడోతు లక్ష్మీనారాయణ, ఆడోతు నాగ, ఆడోతు రమేష్, ఆడోతు రవి, ఆడోతు ఉషారాణి, నాగేశ్వరరావు, బాలమ్మను మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం కొతవారి అగ్రహారం గ్రామంలో బంధువుల ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ జానీ, పోలీస్ సిబ్బంది వెంకన్న, కృష్ణవేణి ఉన్నారు.

టాటా ఏస్ వాహనాన్ని ఢీకొని కారు బోల్తా

- ఇద్దరు మృతి, మరో ముగ్గురికి గాయాలు
- మృతులు అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వాసులు
- హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఘటన



ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందుభాగం



బొమ్మనబోయిన రామారావు(ఫైల్)



నక్క పెంటయ్య (ఫైల్)

హాలియా: కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన రామారావు, నక్క పెంటయ్య, మకరబోయిన వెంకటేశ్వర్లు, చిన్న దిబయ్య, అంకాల చినఏడుకొండలు కలిసి కారులో వ్యక్తిగత పనుల నిమిత్తం నాగార్జునసాగర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నాగార్జునసాగర్ నుంచి హాలియా మీదుగా మిర్యాలగూడకు వెళ్తున్నారు. మార్గమధ్యలో హాలియా పట్టణంలోని ఆంజనేయ రైస్ మిల్లు వద్ద మిర్యాలగూడ 167వ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే నిలిపిన టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బొమ్మరబోయిన రామారావు(40) నక్క పెంటయ్య (56) మృతిచెందారు. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో ప్రస్తుతం నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు రామారావు కుమారుడు బొమ్మరబోయిన గోపాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

మృతుల్లో చిట్యాల సర్పంచ్ భర్త..

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో చిట్యాల గ్రామ సర్పంచ్ బొమ్మరబోయిన నాగేంద్ర భర్త రామారావు ఉన్నారు. రామారావు కూడా గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

- ఊరేగింపునకు ఉపయోగించే ఇత్తడి వాహనాలను ఎత్తుకెళ్లిన దొంగలు



చోరీ జరిగిన వేణుగోపాలస్వామి ఆలయం ఇదే..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడి స్వామివారి ఊరేగింపు సేవలకు ఉపయోగించే ఇత్తడి వాహనాలను ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి దరూరి జగన్నాథాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో స్వామివారి ఊరేగింపు సేవలకు ఉపయోగించే వాహనాలు ఉంచే గదికి సోమవారం రాత్రి దొంగలు కన్నం వేసి లోపలికి ప్రవేశించి హనుమంత వాహనం, అశ్వ వాహనం, గరుత్మంతుడి వాహనం, శేష వాహనాలను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయంలో పనిచేసే పనివాళ్లు గదులను శుభ్రం చేస్తుండగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆలయ అర్చకుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన వాహనాలు ఇత్తడితో చేసినవి కావడం గమనార్హం.

టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి



గుంజబోయిన శ్రీను (ఫైల్)

అడవిదేవులపల్లి: టిప్పర్ కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అడవిదేవులపల్లి మండలంలోని అడవిదేవులపల్లి–బాల్నేపల్లి గ్రామాల మధ్య మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాలకు చెందిన గంజబోయిన శ్రీను (50) గత కొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి అడవిదేవులపల్లిలో ఉంటూ క్వారీల్లో రాయి కొట్టి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం వ్యక్తిగత పనిపై శ్రీను తన భార్య కోటేశ్వరీతో కలిసి బైక్‌పై స్వగ్రామం చిట్యాలకు వెళ్లాడు. పని ముగించుకొని భార్యాభర్తలు తిరిగి అడవిదేవులపల్లికి వెళ్తుండగా.. అడవిదేవులపల్లి–బాల్నేపల్లి గ్రామాల మధ్యన థర్మల్ విద్యుత్ ప్లాంట్ అవసరాల కోసం తీసిన నీటి పైపులైన్ గుంతను పూడ్చేందుకు ఎదురుగా మట్టితో లోడుతో వస్తున్న టిప్పర్‌ను క్రాస్ చేశారు. అక్కడే రోడ్డు గుంతలుగా ఉండటంతో శ్రీను బైక్‌ను నిలిపివేశాడు. ఇది గమనించని టిప్పర్ డ్రైవర్ మట్టిని అన్‌లోడ్ చేసేందుకు టిప్పర్‌ను రివర్స్ చేశాడు. దీంతో కంగారుపడ్డ శ్రీను తన భార్యను బైక్‌పై నుంచి నెట్టివేయగా.. టిప్పర్ టైర్ శ్రీను పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తన కళ్ల ముందే భర్త మృతిచెందడంతో కోటేశ్వరీ రోదనలు మిన్నంటాయి. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. మృతుడి చిన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



సైదులు (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి): మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండలంలోని చిన్ననెమిలా గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్ననెమిలా గ్రామానికి చెందిన బొల్లికొండ సైదులు, రేణుక భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు డిగ్రీ, చిన్న కుమారుడు ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. సైదులు మద్యానికి బానిసై ఇంటిని పట్టించుకోకపోవడంతో భార్య రేణుక తన పిల్లలతో కలిసి ఖమ్మం వెళ్లి అక్కడే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం సైదులు ఖమ్మంలో ఉంటున్న భార్యాపిల్లల వద్దకు వెళ్లి వారిని ఇంటి రమ్మని కోరాడు. మద్యం మానేస్తేనే వస్తానని భార్య చెప్పడంతో మంగళవారం ఇంటికి వచ్చిన సైదులు మనస్తాపం చెంది మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

కానిస్టేబుల్ నాగరాజుకు కన్నీటి వీడ్కోలు



నాగరాజు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్

నేరేడుచర్ల: నాగార్జునసాగర్ డ్యాం వద్ద స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ సోమవారం గుండెపోటుతో మృతిచెందిన కొమత్రాజుల నాగరాజు భౌతికకాయానికి ఆయన స్వస్థలం నేరేడుచర్లలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. నాగరాజుకు బంధువులు, స్నేహితులు తదితరులు కన్నీటి వీడ్కోలు పలికారు. నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ నాగరాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు చిత్తలూరి సైదులు, నాగరాజు, మార్కండేయ, సైదులు, ఇస్తియాక్, వెంకట్, జాన్, సైదులు, సతీష్ తదితరులున్నారు.

మహిళను దుర్భాషలాడిన ఎమ్మెల్యే



బీజేపీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బాధిత మహిళ

వేములపల్లి: మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఓ మహిళపై నోరు పారేసుకున్నారు. వివరాలు.. వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే భాస్కర్‌రావును గ్రామానికి చెందిన వనం విజయలక్ష్మి తనకు అన్ని అర్హతలు ఉన్నా గృహలక్ష్మి పథకంలో తన పేరును ఎందుకు తొలగించారంటూ అడిగింది. దీంతో సహనం కోల్పోయిన ఎమ్మెల్యే ఆమెను పరుష పదజాలంతో దూషిస్తూ.. 'నీకు ఇల్లు పెట్టనుపో.. ఏం చేసుకుంటావో చేసుకో.. దానిని బయటికి నెట్టేయండి' అంటూ పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు సదరు మహిళను బయటకు తీసుకెళ్తుండగా ఆమె ఎమ్మెల్యేను తిడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ గృహలక్ష్మి పథకంలో ఇల్లు అందుతుందని, విజయలక్ష్మి అర్హురాలు అయితే తానే స్వయంగా ఆమెకు పథకం అందేలా చూస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా రెండో విడత గొర్రెల పంపిణీలో అర్హులకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తల పేర్లే జాబితాలో పొందుపరిచారంటూ సల్కునూరు గ్రామానికి చెందిన యాదవులు నిరసన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు తీసుకోవడం లేదంటూ నిరసన..

కాగా ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయడానికి సాయంత్రం వేములపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు తన ఫిర్యాదును స్వీకరించలేదని బాధిత మహిళ వనం విజయ ఆరోపించారు. పోలీసుల తీరును నిరసిస్తూ బీజేపీ నాయకులతో ఆమె పోలీస్ స్టేషన్‌లోనే బైఠాయించింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనపర్తి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. ఇదే విషయమై స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఆమె ఇచ్చిన ఫిర్యాదును తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. నిరసన తెలిపిన వారిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రతన్‌సింగ్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు చిత్ర సాంబమూర్తి, పెదమాం వెంకన్న, చలమల్ల సీతారాంరెడ్డి, పందిరి భాగ్యమ్మ, జవ్వాజి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి : ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం ప్రభుత్వం నిర్ణయించడం లేదన్నారు. అనంతరం పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి కనగోని లలిత, మండల అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జీతం ఇవ్వడం లేదని బిల్ కలెక్టర్ ఆందోళన

మోటకొండూర్: తనకు కావాలనే పంచాయతీ కార్యదర్శి మూడు నెలలుగా జీతం ఇవ్వడంలేదని మండలంలోని ముత్తిరెడ్డిగూడెం బిల్ కలెక్టర్ పసునూరి నర్సింహ గురువారం గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఒంటిపై డీజిల్ పోసుకొని ఆందోళన చేపట్టాడు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకొని తనకు రావాల్సి జీతం డబ్బులను ఇప్పించాలని డిమాండ్ చేశాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శశిధర్‌రెడ్డిని వివరణ కోరగా.. తాను మూడు నెలలుగా సెలవులో ఉన్నానని, 20రోజుల క్రితమే మళ్లీ డ్యూటీలో చేరానని తెలిపారు. గత మూడు నెలలుగా వసూలు చేసిన బిల్లులకు సంబంధించిన డబ్బులను నర్సింహ్మ తన వద్దే పెట్టుకున్నాడని, బిల్ బుక్‌తో పాటు డబ్బులను ఎస్టీఓలో జమచేయటానికి ఇవ్వాలని కోరగా.. అతడు ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో అవి ఇచ్చి జీతం తీసుకోవాలని సూచించానని, దీనిపై అతడు రాద్ధాంతం చేస్తున్నాడని అన్నారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లానని, ఉన్నతాధికారులకు కూడా తెలియజేస్తాని పేర్కొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని హైదర్‌పూర్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పుట్నాల కుంట అలుగు శంకుస్థాపన కొరకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అయితే మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనుండటంతో అధికారులు హుటాహుటిన తిరిగి పునఃనిర్మించారు. అదేవిధంగా భీమనపల్లి మూసీపై నిర్మించిన బ్రిడ్జిని ఇటీవల ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆ శిలాఫలకంలోని స్టీల్ పలకాన్ని కూడా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం భీమనపల్లి మల్లికార్జున దేవాలయం పక్కన యాదవ సంఘం భవనం శంకుస్థాపన కొరకు ఏర్పాటు చేసిన దిమ్మెను సైతం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వరుసగా శిలాఫలకాలు ధ్వంసమవుతుండటం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

పిడుగుపాటుతో మహిళ మృతి



లక్ష్మమ్మ (ఫైల్)

హుజూర్‌నగర్: పిడుగుపాటుకు గురై ఓ మహిళ, గొర్రె మృతిచెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్ శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జక్కుల లక్షమ్మ, జక్కుల కవిత, జక్కుల లింగమ్మ, జక్కుల సత్యావతి, తండు స్వరూప మంగళవారం రామస్వామి గట్టుకు అవతలి వైపున గేదెలు, గొర్రెలను మేపుతున్నారు. సాయంత్రం వచ్చిన వర్షానికి వారంతా సమీపంలోని ఓ చెట్టు కిందకు చేరారు. ఈ క్రమంలో చెట్టుకు సమీపంలో పిడుగు పడడంతో జక్కుల లక్షమ్మ (52)తో పాటు గొర్రె అక్కడికక్కడే మృతిచెందింది. మిగతా వారు స్పృహతప్పి పడిపోయారు. వారిలో జక్కుల కవితకు తీవ్ర గాయాలు కాగా జక్కుల లింగమ్మ, జక్కుల సత్యావతి, తండు స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న కవితను ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

అజయ్‌కుమార్ మిశ్రాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

భువనగిరిటౌన్ : కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లాకార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, కల్లూరి రాజయ్య, మల్లేశం, దయ్యాల నర్సింహ, వామపక్షాల నాయకులు నర్సయ్య, ఆనంద్, పుట్ట రమేష్, చింతల మాల్లేశం, లలిత, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సమ్మె బాటలో 104 ఉద్యోగులు

- 6వ తేదీ వరకు నిరసన దీక్షలు
- 7న చలో హైదరాబాద్
- ప్రభుత్వం స్పందించకుంటే 9 నుంచి నిరవధిక సమ్మె



డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో దీక్ష చేస్తున్న 104 ఉద్యోగులు

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా 104 వాహనాల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. జిల్లాలో 23 మంది ఫార్మసిస్టులు, 21 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 12 మంది డేటాఎంట్రీ ఆపరేటర్లు, 14 మంది డ్రైవర్లు, ఆరుగురు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. వారంతా 2008 సంవత్సరంలో ప్రభుత్వం ప్రారంభించిన 104 వాహనాల్లో పనిచేయడానికి నియమించబడ్డారు. 2011లో ప్రభుత్వం 104 వాహనాలను స్వాధీనం చేసుకుని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. ప్రతి గ్రామానికి 104 వాహనంలో వెళ్లి ప్రజలకు ముఖ్యంగా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు అక్కడే మందులను కూడా అందిస్తూ వచ్చారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 2021 అక్టోబర్‌లో 104 సర్వీసులను రద్దు చేసింది. అందులో పనిచేసే సిబ్బందిని మాత్రం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో సర్దుబాటు చేసి వారి సేవలను వినియోగించుకుంటుంది. వారికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు నెలనెలా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఉద్యోగం పోతుందోనన్న భయంతో 104 సేవల ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని వారు పలు దఫాలుగా ఆందోళనలు, నిరసనలు చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. కానీ ఇప్పటి వరకు వారికి ఎలాంటి భరోసా లభించలేదు. దీంతో వారు మంగళవారం నుంచి శుక్రవారం వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో రిలే నిరసన దీక్షలకు పూనుకున్నారు. ఈ నెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 9వ తేదీ నుంచి ఉద్యోగులంతా నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. తమ డిమాండ్‌లను ఆమోదించే వరకు సమ్మెను కొనసాగించనున్నట్లు ఉద్యోగులు పేర్కొన్నారు.

డెంగీతో యువతి మృతి

ఆలేరురూరల్: మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన యువతి డెంగీతో మంగళవారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన గ్యాదపాక పూజ(19) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆలేరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి జనగామలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్లు డెంగీ సోకిందని నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది.

కారుపై పడిన చెట్టుకొమ్మ



చెట్టు కొమ్మ పడడంతో పగిలిన అద్దం

రామన్నపేట: రోడ్డుపై వెళ్తున్న కారుపై చెట్టుకొమ్మ పడడంతో కారు ధ్వంసమైంది. వివరాలు.. రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు శివకోటి మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని తన కారులో నల్లగొండకు బయల్దేరాడు. రామన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చెట్టు నరికివేసే పనులు జరుగుతున్నాయి. అక్కడ వాహనాలను నియంత్రించకపోవడంతో అటుగా వెళ్తున్న శివకోటి కారుపై చెట్టుకొమ్మ పడిడడంతో కారు ధ్వంసమైంది. అదృష్టవశాత్తు శివకోటికి ఎలాంటి గాయాలు కాలేదు.

జీవశాస్త్ర పద్ధతులతో చీడ పీడల నివారణ

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు సూచనలు



రాజగోపాలరావు, ఏఓ, నడిగూడెం



గుడ్లను తింటున్న అక్షింతల పురుగు

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పెరిగే దశలో ఉంది. ఈ దశలో పురుగులు, తెగుళ్ల ఆశించి పంటను నష్టపరుస్తుంటాయి. ఇలాంటి సమయంలో రైతులు విపరీతంగా రసాయన పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. అయినా కొన్ని రకాలు పురుగులు నివారణ జరగడం లేదు. ఇలాంటి సమయంలో కేవలం రసాయన మందులను ఉపయోగించకుండా జీవ శాస్త్ర పద్ధతుల ద్వారా చీడ పీడలను నివారించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ప్రకృతిలో పైర్లకు హాని చేసే పురుగులు, మేలు చేసే పురుగులు ఉన్నాయి. కొన్ని పైర్లకు హానిచేస్తాయి. ఇవి శత్రు పురుగులు. ఈ పురుగులను తినే పురుగులను మిత్ర పురుగులు అంటారు. వరి జీవావరణ వ్యవస్థలో కీడు చేసే పురుగుల కన్నా మేలు చేసే పురుగులే ఎక్కువగా ఉన్నాయి. పురుగు మందులు విపరీతంగా వాడడం వలన పైర్లకు హాని చేసే పురుగుల కంటే మేలు చేసే పురుగులు ఎక్కువ నష్టం కలుగచేస్తాయి. వరిలో మేలు చేసే పురుగులను మూడు రకాలుగా విభజించవచ్చు.

భక్షకాలు(పరాన్న జీవులు) : హాని కలిగించే పురుగు తల్లి పురుగు, గొంగళి పురుగు లేదా గుడ్లనుకాని ఆహారంగా తీసుకుంటాయి. **సాలె పురుగు:** ఇవి వరిని ఆశించే శత్రు పురుగులపైన ముఖ్యమైన భక్షకాలు. పిల్ల, తల్లి సాలె పురుగులు దోమ, కాండం తొలిచే పురుగు, పచ్చదోమ, ఆకుముడత పురుగులును భక్షిస్తాయి. రోజుకు 5–15 శత్రు పురుగులను తింటాయి. ఒక సాలె పురుగు క్రిమిసంహారక మందుల కన్నా ఎక్కువ లాభం చేకూర్చుతుంది.

తూనీగలు: వీటి పిల్ల పురుగులు నీటిపై నుంచి వరి దుబ్బుల పైకిపోయి దోమ పిల్ల పురుగులను తింటాయి. తూనీగలు వరిపైరుపై తిరుగుతూ పచ్చదోమలను, ఆకు ముడత పురుగు గుడ్లను తింటాయి.

నల్లులు: పచ్చ నల్లులు, తల్లి పురుగులు తల నల్లగా ఉండి, పిల్ల పురుగులు పచ్చగా ఉంటాయి. ఇవి దోమ గుడ్లను దోమలను ఇష్టంగా తింటాయి. ఒక నల్లి 7–10 గుడ్లను, 2–5 దోమలను ఒక రోజులో తింటాయి.

అక్షింతల పురుగు: పగలు చురుకుగా ఉండి దుబ్బుల పైభాగాన ఉండి ఆకుముడత గుడ్లను తింటాయి. వీటి పిల్ల పురుగులు చురుకుగా ఉండి రోజుకు 5–10 దోమలును తింటాయి.

బారు మీసాల మిడత: దీని మీసాలు శరీర పొడవుకంటే రెట్టింపు ఉంటాయి. ఇవి రాత్రులందు చురుకుగా ఉండి వరినల్లి కాండం తొలిచే పురుగు గుడ్ల సముదాయాన్ని నుడి దోమలును తింటాయి.

బదనికలు: (పరాన్న జీవులు): శత్రు పురుగుల మీద ఆధారపడి దాని గుడ్డు, లార్వా, కోశస్థ దశ మీదగానీ, లోపల గానీ జీవిత చరిత్రను పూర్తిచేసుకొని, వాటిని చంపి, అందులో ఉండి పరాన్న జీవులు బయటకు వస్తాయి.

గుడ్డు పరాన్న జీవులు: ఇవి చిన్న కందిరీగలు. ఇవి ఆకు ముడత, కాండం తొలుచు పురుగు గుడ్ల మీద గుడ్డు పెట్టి అందులో పెరిగి జీవిస్తున్న పరాన్న జీవులు బయటకు వస్తాయి. ఉదా: ట్రైకోగ్రామా కందిరీగ

లద్దె పురుగులను ఆశించే పరాన్న జీవులు: వరి పంటను ఆశించేలార్వాలపై కందిరీగ గుడ్లు పెడుతుంది. ఈ పరాన్న జీవి పిల్ల పురుగులు పంటకి హాని చేసే లార్వాలపై ఆశించి నాశనం చేస్తాయి. ఈ కందిరీగలు 4–7 రోజులు బతుకుతాయి. ఉదా: జాంతో పింప్లా.

కోశస్థ దశను ఆశించే పరాన్న జీవులు: బ్రాకిమిరియా కందిరీగలో ఆకుముడత కోశస్థ దశలో ఆశించి వాటిని నాశానం చేసి, పరాన్న జీవులు బయటకు వస్తాయి.

వ్యాధి జనకాలు : మనుషులకు రోగాలను కలిగించే క్రిములున్నట్లే జబ్బులను కల్గించే క్రిములు కూడా ఉన్నాయి. వీటిలో బవేరియా వంటి బూజు జాతికి చెందిన శిలీంద్రాలు కాండం తొలిచే పురుగు మీద, ఎన్‌పీవి. అనే వైరస్ రెల్లరాల్చు పురుగు మీద వ్యాధులు కలిగించడం వలన అవి చలన రహితమై నశిస్తాయి. వరిలో జీవావరణ వ్యవస్థలో ఎన్నో మిత్ర పురుగులు, శత్రు పురుగులను ప్రకృతి సిద్ధంగా నియంత్రిస్తున్నాయి. కాబట్టి రైతులు పైరు తొలి దశలలో పురుగు మందులు వాడకుండా మిత్ర పురుగుల వృద్ధి అయ్యేటట్లు చూడాలి. కనీసం వారినికి ఒక్కసారైనా రైతులు స్వయంగా పొలాల్లో తిరిగి వివిధ దశలలో చీడ, పీడల ఉనికిని క్రిమి కీటకాదులను నిశితంగా పరిశీలించి నివారణ చర్యలు చేపట్టాలి.